క్లుప్తంగా

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాపూలే



పూలే వేషధారణలో విద్యార్థులకు బోధన చేస్తున్న రామానాయుడు

విజయనగరం టౌన్: అణగారిన వర్గాల ప్రజలకు విద్యనందించిన ఆశాజ్యోతి బాపులే అని శ్రీనివాసా ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఆర్‌బీ రామానాయుడు కొనియాడారు. గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్‌లో మహాత్మా జ్యోతిబాపులే వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూలే వేషధారిగా రామానాయుడు విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన, మహిళాభ్యున్నతికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మెయిద నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలు



ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్న ఓటర్ల జాబిత జిల్లా పరిశీలకుడు శ్యామలరావు

భోగాపురం: ఓట్ల జాబితాలను ఓటర్లకు అందుబాటులో ఉండేలా పోలింగ్ కేంద్రాల ముందు వేలాడదీయాలని జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకుడు జె. శ్యామలరావు రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మండల పరిధి రాజాపులోవలోని 196వ పోలింగ్ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం కొత్తగా నమోదైన ఓటర్లు, చేర్పులు, మార్పులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యకళ, ఈఆర్‌ఓ నూకరాజు, ఎలక్షన్ డీటీ మూర్తి, తహసీల్దార్ చింతా బంగార్రాజు, ఉప తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిశోర్, బీఎల్‌ఓ ఎంవీవీ అశోక్, ఎస్సై సూర్యకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు కొప్పెర్ల విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల బాలయోగి గురుకులానికి చెందిన విద్యార్థులు జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 హ్యాండ్‌బాల్ విభాగానికి అజయ్‌కుమార్, శ్రావణ్‌కుమార్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను పీడీ కృష్ణ, పీఈటీ సత్యనారాయణ, తదితరులు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

మెట్టు భూముల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: మెట్టు భూముల సమస్యలను పరిష్కరించాలని మెంటాడ మండలం పణుకువలస గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. ఈ మేరకు ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును సోమవారం ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదయ్యాయన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. దీనికి డీవీజీ స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

విజయనగరం పూల్‌బాగ్: దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు ఎస్సీ కార్పొరేషన్ రుణాలను పునరుద్ధరించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘ జిల్లా కార్యదర్శి ఆర్. ఆనంద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 11 చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సుమారు 50 సంవత్సరాలుగా దళితులు ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారికి ఆ భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘ నాయకులు వెంకటరావు, రాకోటి రాములు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

- పశుపతినాథేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు
- స్పటికలింగానికి పంచామృతాలతో అభిషేకాలు



విజయనగరం టౌన్: స్పటికలింగాకారునికి పాలాభిషేకం చేస్తున్న అర్చకుడు



భోగాపురం: శివాలయంలో భక్తుల సందడి

విజయనగరం టౌన్: కార్తీకమాస రెండో సోమవారం సందర్భంగా ఆలయాల్లో శివనామస్మరణ హోరెత్తింది. స్థానిక రింగురోడ్డులో ఉన్న పశుపతి నాథేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో స్పటిక లింగానికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారికి 108 లీటర్ల పాలతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన రుద్రాభిషేకాల్లో 75 మంది దంపతులు పాల్గొన్నారు. అదేవిధంగా మూడుకోవెళ్ల, శివాలయం వీధిలో కొలువైన ఉమారామలింగేశ్వర స్వామికి, కొత్త అగ్రహారంలో ఉన్న శివాలయంలో స్వామివారికి విశిష్ట పూజలు చేపట్టారు. బాబామెట్ట, పూల్‌బాగ్, వీటీ అగ్రహారం, అయ్యన్నపేట, తదితర ప్రాంతాల్లో ఉన్న శివాలయాలకు భక్తులు పోటెత్తారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

పోటెత్తిన భక్తులు

భోగాపురం: మండల కేంద్రంలోని శివాలయం భక్తులతో కిటకిటలాడింది. అభిషేక ప్రియుడైన ఈశ్వరుడి శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అరవెలపల్లి గురునాథ స్వామి, రాధాకృష్ణ కార్తీకమాసం విశిష్టత గురించి వివరిస్తూ, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

నేటితో ముగియనున్న క్రెడయ్ ప్రాపర్టీ షో

విజయనగరం: క్రెడయ్ విజయనగరం చాప్టర్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రాపర్టీ టెక్ ప్రదర్శనకు అనూహ్య స్పందన లభిస్తోంది. నగరంలోని రింగ్‌రోడ్డులో గల లీ పేరడైజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న ప్రదర్శనను విజయనగరం జిల్లా కేంద్రంతో పాటు, వివిధ గ్రామీణ ప్రాంతాలకు చెందిన సుమారు ఐదు వేలకు మందికి పైగా సందర్శకులు వీక్షించారు. క్రెడయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రదర్శనలో ఇళ్ల స్థలాలు, ఇంటీరియర్, ఇల్లు నిర్మించుకోవాలనుకుంటున్న వారి కోసం ఏర్పాటు చేసిన ప్రదర్శన పెట్టుబడిదారులని ఆకట్టుకుంది. తమకు అవసరమైన స్థిరస్తులు, నిర్మాణాలకు అవసరమైన ముడి సామాగ్రి కంపెనీలను ఒకే వేదిక వద్ద ఏర్పాటు చేయటం పట్ల సందర్శకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మంగళవారంతో ప్రదర్శన ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ విజయనగరం చైర్మన్ వి. పార్థసారథి, అధ్యక్షుడు సూర్యనారాయణ రాజు, కార్యదర్శి కె.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



క్రెడయ్ ప్రాపర్టీ షోలో సందర్శకుల సందడి

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేలా తనిఖీలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు

- మాజీ ఎమ్మెల్సీ గాదె

విజయనగరం అర్బన్: విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా అధికారుల తనిఖీలుండాలే తప్ప.. ఉపాధ్యాయులను నిందితులుగా నిలబెట్టే విధంగా ఉండకూడదని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. సోమవారం స్థానిక పీఆర్‌టీయూ సంఘ కార్యాలయంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తరగతి గదిలోని విద్యార్థులందరి అభ్యసనా సామర్థ్యాలు ఒక్కలా ఉండవని.. అధికారులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అసమానంగా ఉండే విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలతో శతశాతం ఉత్తీర్ణత సాధించడం సాధ్యం కాదన్నారు. తరగతి గదిలో అందరి విద్యార్థుల స్థాయి కాకుండా.. పరిమిత విద్యార్థుల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పుడు కూడా సరిపడా సామర్థ్యం కొరవడితే, అక్కడి ఉపాధ్యాయులకు మరొక అవకాశం ఇవ్వాలని సూచించారు. ఇలాంటి చర్యలు చేపడితే ఉపాధ్యాయులు మరింత ఉత్సాహంగా పనిచేస్తారని, తద్వారా విద్యాప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, అధ్యక్షుడు వి.రవీంద్రనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంకపల్లి శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.శ్రీనివాసరావు, అర్బన్ ప్రధాన కార్యదర్శి చిట్టి రామినాయుడు, రూరల్ అధ్యక్షుడు రెడ్డి గణపతి, గంట్యాడ మండల ఉపాధ్యక్షుడు సీహెచ్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ బోర్డు క్యాంప్‌లపై సమీక్ష



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: అర్హత ఉండి ఆధార్ కార్డులో సాంకేతిక సమస్యలతో వృద్ధాప్య పింఛన్లు పొందలేని వృద్ధుల కోసం మెడికల్ బోర్డుల ద్వారా ధ్రువపత్రాల మంజూరుపై సంబంధిత అధికారులతో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం తన కార్యాలయంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అనీలా సునందని, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ్ చక్రవర్తి, వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన వృద్ధులు సాంకేతిక కారణాలతో పింఛన్లు పొందలేకపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సూచన మేరకు మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసి, అవసరమైన వారికి అర్హతలు కల్పించాలన్నారు.

అందుబాటులో వీఆర్‌ఓలు, సర్వేయర్లు



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు సచివాలయాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని దుప్పాడ గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించి, ఉద్యోగుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు తాను సందర్శించిన గ్రామ సచివాలయాల్లో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు అందుబాటులో లేరని తెలిపారు. సచివాలయ వ్యవస్థలో కీలకమైన విధులు నిర్వహిస్తున్న వీఆర్వోలు, సర్వేయర్లపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, వీరిపై ఉన్నతధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ వితరణ

విజయనగరం రూరల్: రామభద్రపురం మండలం కోటసిర్లం గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఆల్తి సింహాచలంకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఎలక్ట్రికల్ ట్రై సైకిల్‌ను అందజేశారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలో జరిగిన ఓ కార్యక్రమంలో లబ్ధిదారుడికి అందించారు.



సింహాచలంనకు ట్రై సైకిల్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలి..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



రుద్రాభిషేకంలో పాల్గొన్న కోలగట్ల వీరభద్రస్వామి దంపతులు

విజయనగరం: పరమేశ్వరుడి కృపాకటాక్షాలతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. కోలగట్ల తన స్వగృహంలో వేద పండితుల సమక్షంలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకులు దూసి శివ, తదితరులు రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, లోక కల్యాణార్థం ప్రతి ఏడాదీ కార్తీకమాసంలో రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు.

అభినందనలు..

విజయనగరం: విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్‌లో సద్గురు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ఏర్పాటుకు సహకరించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కోలగట్ల నివాసానికి విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు సోమవారం చేరుకుని డిప్యూటీ స్పీకర్‌కు పుష్పగుచ్ఛాలు, పండ్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా 4వ డివిజన్ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనా ప్రసాద్ మాట్లాడుతూ, తమ సామాజికవర్గాన్ని గుర్తించి, సముచిత స్థానాన్ని కల్పించిన మహావ్యక్తి కోలగట్ల వీరభద్రస్వామి అని కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమ వర్గానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి డైరెక్టర్‌గా స్థానాన్ని కూడా కల్పించడం మరువలేమన్నారు. అదేవిధంగా నగరంలో ఏ కార్యక్రమం తలపెట్టినా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహాయ సహకారాలు సంపూర్ణంగా అందిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కోలగట్లను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేముల రాంప్రసాద్, వరాహాచారి, తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ ప్రతినిధులు

బస్సుయాత్రను విజయవంతం చేయండి

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: నెల్లిమర్ల మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి, మంచి పనులను ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతోనే సాధికార బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బడుగు, బలహీనవర్గాలకు సీఎం జగన్ ఎంతో మేలు చేస్తున్నారని, వారందరినీ కలుపుకునేందుకు ఈ బస్సుయాత్ర దోహదపడుతుందన్నారు. ఈ యాత్రలో రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు, రాష్ట్ర స్థాయి నాయకులు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు పాల్గొంటారని తెలిపారు. పార్టీ శ్రేణులంతా బస్సుయాత్రను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అధికసంఖ్యలో ప్రజలు పాల్గొనేలా కృషి చేయాలని కోరారు.



ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

అభివృద్ధి పరిరక్షణకు చర్యలు

- గడిచిన నాలుగున్నరేళ్లలో కార్పొరేషన్ స్థాయిలో నగర అభివృద్ధి
- ఎమ్మెల్యే కోలగట్ల చొరవతో నగర సుందరీకరణ
- అభివృద్ధి పనులను పరిరక్షించేందుకు చర్యలు ప్రారంభించిన కార్పొరేషన్



డిసెంబర్ ఒకటి నుంచి గోడలపై ఇలాంటి పోస్టర్లు నిషేధం





అభివృద్ధి పనులతో సుందరంగా దర్శనమిస్తున్న ట్యాంక్‌బండ్ రోడ్, మయూరి జంక్షన్



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మగ్ విత్ టీపాయ్

విజయనగరం: విజయనగరం పేరుకు జిల్లా కేంద్రమైనా ఒకప్పుడు పెద్ద పల్లెటూరు అనే భావన ఉండేది. అయితే ప్రస్తుతం అభివృద్ధి చెందిన నగరాల సరసన నిలిచిందంటే ఆ గొప్పతనం విజయనగర వాసులకే చెల్లుతుంది. కోట్లాది రూపాయలు వెచ్చించి ఎంతో అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన వైనం ఆదర్శప్రాయమనే చెప్పాలి. ఒకవైపు ప్రజాప్రతినిధులు, మరోవైపు అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి కార్పొరేషన్ స్థాయికి నగరాన్ని తీసుకువెళ్లాలన్న దృఢ సంకల్పంతో చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలు ఇచ్చాయి. అయితే వీటన్నింటినీ పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మాత్రం ప్రజలపైనే ఉందని మరోసారి చెప్పక తప్పదు. గడిచిన నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని సంరక్షించుకునేలా కార్పొరేషన్ యంత్రాంగం చర్యలు చేపట్టింది.

వాణిజ్య కేంద్రం

వాస్తవంగా చెప్పాలంటే ఉత్తరాంధ్రకు వాణిజ్య కేంద్రంగా ఉండే విజయనగరం అప్పట్లో అనుకున్నంత అభివృద్ధి సాధించలేకపోయింది. కారణాలు ఏమైనప్పటికీ నగరాన్ని మాత్రం తీర్చిదిద్దలేకపోయారనే చెప్పవచ్చు. ప్రస్తుతం రోజులు మారాయి. అందుకు తగ్గట్లుగానే మున్సిపాలిటీగా ఉన్న పట్టణం కార్పొరేషన్ స్థాయికి ఎదిగింది. 2021లో జరిగిన ఎన్నికలు కార్పొరేషన్ స్థాయిలో జరగడంతో 50 డివిజన్‌లు ఏర్పడ్డాయి. శివారు ప్రాంతాలను కూడా కలుపుకుని అతి పెద్ద నగరంగా రూపాంతరం చెందింది. సుమారు 65 వేల ఇళ్ల సముదాయాలతో ప్రస్తుతం కార్పొరేషన్‌గా ఏర్పడింది. దీంతో అదే స్థాయిలో అభివృద్ధి కూడా జరగాలన్నదే ప్రజాప్రతినిధులు, అధికారుల ఆలోచన. అందుకు తగ్గట్లుగానే నగరంపై పూర్తి అభిమానం, అంచనాలు ఉన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఇందుకు చొరవ చూపారు. విజయనగరాన్ని కార్పొరేషన్ స్థాయికి తగ్గట్టుగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అందుకు అవసరమైన వనరులు సమకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కార్పొరేషన్ బడ్జెట్ రూ.140 కోట్లకు చేరుకునేలా ప్రయత్నించి, సఫలమయ్యారు. తొలుత శత శంకుస్థాపనలతో వంద పనులు చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పించారు. తదనంతర కాలంలో ద్విశత శంకుస్థాపన కార్యక్రమం చేపట్టి 200 అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో దాదాపుగా 90 శాతం వరకు పనులు పూర్తి చేశారు. ఇలా ఒక వైపు అభివృద్ధి, మరోవైపు నగర అందాలపై డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దృష్టి సారించారు. రహదారుల విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేశారు. నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దడంతో ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలదే..

ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంతో ప్రయాస కోర్చి, ఎన్నో కోట్ల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉంది. నగర అందాలు, సుందరీకరణకు విఘాతం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపేందుకు రంగం సిద్ధం చేశారు. ఇష్టారాజ్యాంగా ప్రైవేట్, ప్రభుత్వ గోడలపై పోస్టర్లు అతికించడం, నినాదాలు రాసి నగర అందాలకు ఇబ్బంది కలిగించే వారిపై చర్యలకు ఉపక్రమించనున్నారు. చట్టపరమైన చర్యలతో పాటు పది వేల రూపాయల అపరాధ రుసుం కూడా వసూలు చేయనున్నారు. ఇందుకోసం డిసెంబర్ ఒకటో తేదీ నుంచి నగర ప్రణాళిక అధికారులు, ప్రజారోగ్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి నిత్య పర్యవేక్షణ చేస్తారని కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు స్పష్టం చేశారు.

జేసీ నాయుడికి అభినందనలు



జయచంద్రనాయుడుకు అభినందనలు తెలుపుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు

విజయనగరం ఫోర్ట్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ముద్రు జయచంద్రనాయుడును (జేసీ నాయుడు) ఆయన నివాసంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని శంకరరావు కోరారు.